ముంపు బాధలు ఇంకెన్నాళ్లు..?


ఇటీవల కురిసిన వర్షానికి వాగును తలపిస్తున్న ప్రధాన రహదారి (ఫైల్)


ఓ హోటల్‌లోకి చేరిన వరద, మురుగు నీరు (ఫైల్)

- ప్రణాళిక లేమితో ప్రజలకు శాపం
- భారీ వర్షాలకు జలమయమవుతున్న పలు కాలనీలు
- ఇళ్లలోకి చేరుతున్న వరదనీరు
- శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తుల డిమాండ్

కమలాపూర్ : వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఆ కాలనీవాసుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. భారీ వర్షం కురిసిన ప్రతీసారి బస్టాండ్ ప్రాంతంతో పాటు 11వ వార్డు, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయి. మురుగు, వరద నీరంతా ఏకమై ఇళ్లల్లోకి చేరుతోంది. కాలనీవాసులు బయటకు వెళ్లాలన్నా, ఇంట్లోకి రావాలన్నా ఆ నీళ్ల నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంటోంది. వరద, మురుగు నీటితో దోమల వ్యాప్తి పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ కాలనీలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

వరదనీరు రాకుండా చేయాలి



భారీ వర్షం కురిసిన ప్రతీసారి బస్టాండ్ ప్రాంతమంతా ముంపునకు గురవుతుంది. వరద, మురుగు నీరంతా ఇళ్లలోకి చేరుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరదంతా మా హోటల్లోకి చేరింది. అధికారులు స్పందించి శాశ్వత చర్యలు చేపట్టాలి.

- సుమన్, హోటల్ నిర్వాహకుడు

కాల్వలు లేకపోవడంతోనే..



వరదనీరు వెళ్లేందుకు అనువైన కాల్వలు లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వరద నీరు, మురుగు నీళ్లన్నీ ఇళ్లలోకి చేరుతుంది. దీంతో రాత్రి సమయంలో కంటిమీద కునుకు లేకుండా జాగారం చేయాల్సి వస్తోంది. అధికారులు, పాలకులు శాశ్వత పరిష్కారం చూపాలి.

- కొలిపాక రాజేందర్, స్థానికుడు

ముందుచూపు ఏది..

ముందు చూపు, ప్రణాళిక లేమితో కమలాపూర్ బస్టాండ్, పరిసర ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. భారీ వర్షం కురిసిన ప్రతీసారి హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై వాగును తలపిస్తూ వరద నీరు ప్రవహిస్తుంది. గ్రామంలోని వరదంతా ఇటువైపే వస్తుండగా వరద వెళ్లేందుకు కాల్వలు లేకపోవడంతో ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం జూలైలో కురిసిన భారీ వర్షానికి హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై వరద నీరు నిలిచిపోవడంతో అధికారులు డివైడర్లను అక్కడక్కడా తొలగించి వరద నీటిని మళ్లించి చేతులు దులుపుకొన్నారని, శాశ్వత చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షానికి తమ ఇళ్లలోకి వరద, మురుగు నీరు చేరిందని, తమకు ఈ ముంపు బాధలు ఇంకెన్నాళ్లు అంటూ పాలకులను ప్రశ్నిస్తున్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి


మాందారిపేట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- జాతీయ రహదారిపై ధర్నా

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మాందారిపేట స్టేజీ వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన శాసనసభలో యూరియా కష్టాలను సభ దృష్టికి తీసుకెళ్లామని అయినా ప్రభుత్వం పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు జీవనధార సంజీవనిలాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన లేని వాఖ్యలు చేయడం కాంగ్రెస్ నేతల అవివేకానికి నిదర్శనమన్నారు. ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ ఎంక్వయిరీకి పూనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలో భాగమేనన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పంపించారు. అంతకుముందు మండల కేంద్రంలోని సాయి ఫెర్టిలైజర్ షాపులో యూరియా సరఫరా చేస్తుండగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పరిశీలించి రైతులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ జోన్‌లోనే వ్యాపారం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ ఆదేశాలు


చిరువ్యాపారులను హెచ్చరిస్తున్న మున్సిపల్, పోలీసు అధికారులు

పరకాల: వీధి వ్యాపారులు తప్పకుండా వారికి కేటాయించిన గ్రీన్ జోన్‌లోనే వ్యాపారం చేయాలని పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం మున్సిపల్ అధికారులు, పోలీసులు వీధి వ్యాపారస్తులకు రోడ్లపై జరుగుతున్న విక్రయాల కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కల్పించారు. విక్రయ ప్రాంతాలను జోన్‌లుగా విభజించారు. నిత్యం రద్దీగా ఉండే వీధులను రెడ్ జోన్‌గా, సమయానుభావంగా రద్దీ నెలకొనే ప్రాంతాలను అంబర్ జోన్‌గా, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే వీధులను గ్రీన్ జోన్లుగా గుర్తించారు. ప్రమాదాలకు కారణమవుతున్న వీధుల్లో వ్యాపారం చేయవద్దని కమిషనర్ కె.సుష్మ హెచ్చరించారు. తక్షణమే గ్రీన్ జోన్‌లోకి వెళ్లి వ్యాపారాలు చేసుకోవాలని వీధి వ్యాపారస్తులకు సూచించారు. లేకపోతే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరకాల సీఐ క్రాంతికుమార్, ఏఈ రంజిత్, టీపీఎస్ ఎంఈహెచ్ ఖురేషీ, టీపీబీఓ సందీప్‌రెడ్డి, మెప్మా టీఎంసీ టి.సతీశ్, ఉద్యోగులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రతిభను వెలికితీసేందుకే టీఎల్‌ఎం మేళా


బోధనోపకర ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్మద, ఎంఈఓ ఆనందం, తదితరులు

ఐనవోలు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి టీఎల్‌ఎం మేళా జరిగింది. ఈ మేళాలో మండలంలోని 16 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు పాల్గొన్నాయి. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులకు అనుగుణంగా రూపొందించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. తెలుగు విభాగం నుంచి 36, ఆంగ్లం నుంచి 42, గణితం నుంచి 38, పరిసరాల విజ్ఞానం నుంచి 18 ప్రదర్శనలు ఎంపికలో నిలిచాయి. ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠ్యాంశాలను సులభతరంగా, ఆసక్తికరంగా బోధించడానికి ఉపయోగించే పరికరాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ నర్మద హాజరై మాట్లాడుతూ.. బోధనోపకరణాల వినియోగం విద్యార్థుల్లో ఆకర్షణను పెంచడమే కాకుండా పాఠ్యాంశాల ఆవిష్కరణలో ఉపయోగకారిగా నిలుస్తాయని అన్నారు. అనంతరం ఎంఈఓ పులి ఆనందం మాట్లాడుతూ.. ఇలాంటి మేళా ఉపాధ్యాయుల ప్రతిభను వెలికి తీస్తాయని, సహ ఉపాధ్యాయుల నుంచి కొత్త ఆలోచనలను నేర్చుకునే అవకాశాన్ని కలిగిస్తాయని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు పది ఉత్తమ ప్రదర్శనలు తెలుగు విభాగం నుంచి పీఎస్ ఐనవోలు, పీఎస్ పున్నేలు, ఇంగ్లిష్ విభాగం నుంచి పీఎస్ కొండపర్తి, పీఎస్ నందనం, పీఎస్ కక్కిరాలపల్లి, గణితం నుంచి యూపీఎస్ గర్మిళ్లపల్లి, పీఎస్ ఉడుతగూడెం, పరిసరాల విజ్ఞానం నుంచి యూపీఎస్ గర్మిళ్లపల్లి, పీఎస్ వెంకటాపూర్, పీఎస్ పంథిని ఎంపికైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు. పున్నేలు, ఐనవోలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వసంత కుమార్, శ్రీహర్షుడు, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జగదీశ్వర్‌రెడ్డి



పరకాల : వ్యవసాయ శాఖ పరకాల ఏడీఏగా జగదీశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్‌తో పాటు మండలంలోని ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏడీఏని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారస్తులు, రైతుల సమన్వయంతో ముందుకెళ్లాలని ఆయన సూచించారు. ఆ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడికారి శివాజీ, కోశాధికారి ఎర్రం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడియం పరామర్శ

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగారపు అమృతరావు తండ్రి ఆదాం బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదాం మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా రాము

శాయంపేట : మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సూరం రాము స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈఓ గడ్డం భిక్షపతి తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం వివిధ పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు ఆయనను అభినందించారు. జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజిబాపురావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఇసుక సరఫరాకు రూ. 4వేలు మించొద్దు

- అధికారుల సూచన


ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విక్రమ్ కుమార్

ఐనవోలు : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను దూరాన్ని బట్టి గరిష్టంగా రూ.4వేలకు మించకుండా అందించాలని రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ అధికారులు ట్రాక్టర్ యజమానులకు స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద అధికారులు, నందనం ఆకేరు వాగు నుంచి ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాణ్యమైన ఇసుకను సకాలంలో అందించాలన్నారు. మండల నాయకులు ఈ సమాచారాన్ని గ్రామాల్లోని ప్రతి ఇందిరమ్మ లబ్ధిదారుడికి చేరవేయాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీఓ నర్మద, ఎస్‌హెచ్‌ఓ పస్తం శ్రీనివాస్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, సర్వేయర్ సూరజ్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


దామెర : మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు


శాయంపేట : మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

దామెర : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ రంజిత్‌రావు సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల కార్మికులు, బాల్యవివాహాలు, సీసీ కెమెరాలు తదితర అంశాలపై జాగృతి బృందం పాటలు పాడుతూ కళాజాత నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. మత్తు పదార్థాలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. చెడు మార్గానికి వెళ్లని బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్, పాఠశాల ప్రిన్సిపాల్ సమ్మయ్య, జాగృతి బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, పూల్‌సింగ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో ఎస్సై..

శాయంపేట : సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జక్కుల పరమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శాయంపేట : ఈనెల 5వ తేదిన నిర్వహించే వినాయక నిమజ్జనంలో గొడవలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై జక్కుల పరమేశ్ హెచ్చరించారు. మండలంలో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. వినాయక శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

శారదకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


అవార్డు అందుకుంటున్న పప్పుల శారద

ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన పప్పుల శారదను ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు వరించింది. కరీంనగర్ జిల్లాలో బుధవారం జరిగిన పాఠశాల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో హుజూరాబాద్ మండలం శాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం ఆమెను అభినందించింది.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఇందిరా

కమలాపూర్ : మహిళల రక్షణకు కవచంగా ఉన్న చట్టాలపై ప్రతీ మహిళా అవగాహన కలిగి ఉండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంస్థ కోఆర్డినేటర్ ఇందిరా సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో సఖి కేస్ వర్కర్ భారతితో కలిసి ఆమె మాట్లాడారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. మహిళలకు వేధింపుల సమస్యలు ఏర్పడినప్పుడు ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు ఫోన్‌చేసి తక్షణ సాయం, రక్షణ పొందాలని అన్నారు. అదే విధంగా 0870 2452112, 73829 83088 నంబర్లకు ఫోన్‌చేస్తే బాధిత మహిళలకు సాయం అందిస్తారన్నారు. అంతకుముందు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శ్రీధరణి ఎన్‌జీఓ ప్రతినిధులు డిజిటల్ ఆర్థిక లావాదేవీలు, సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు దయాకర్, పద్మప్రియ, సరిత, ఏపీఎంలు లలితాదేవి, దివాకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి స్రవంతి, కోశాధికారి సృజన, యూనియన్ బ్యాంక్ లీడ్ కోఆర్డినేటర్ అశోక్, శ్రీలత, స్వరూపతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం


ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తున్న డాక్టర్ సుధాకర్

ఎల్కతుర్తి : హుస్నాబాద్ నియోజకవర్గ గ్రామీణ ప్రాంత ప్రజలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను మరింత చేరువచేసేందుకు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని సుధాకర్ మెమోరియల్ నర్సింగ్ హోమ్ ఆరోగ్యశ్రీతో అనుసంధానమైందని డాక్టర్ తిప్పని సుధాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భీమదేవరపల్లి మండలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు అందించి పేద ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా గుండె, మూత్ర సంబంధిత సమస్యలు, డయాలసిస్, మెడికల్, సర్జికల్ తదితర వైద్యం అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

10,11న మండలస్థాయి క్రీడా పోటీలు


మాట్లాడుతున్న ఎంఈఓ రాజేశ్‌కుమార్

దామెర : ఈనెల 10,11వ తేదీల్లో (రెండురోజుల పాటు) మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ఐ మండల కన్వీనర్‌గా దామెర పాఠశాల పీఈటీ మల్యాల దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీన అండర్ 14, 17 బాలికల మండలస్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. అదే విధంగా 11వ తేదీన అండర్ 14,17 బాలురులకు ఎంపికలు ఉంటాయని అన్నారు. దామెర ప్రభుత్వ పాఠశాల మైదానంలో క్రీడా ఎంపికలు ఉంటాయని వెల్లడించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

108 సిబ్బందికి వసతి కల్పించాలి

శాయంపేట : మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ సిబ్బందికి వసతి కల్పించాలని బహుజన సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు మారేపల్లి విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలానికి 108 అంబులెన్స్ కేటాయించారని, కాని సిబ్బందికి ఎలాంటి వసతి కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విధుల్లో లేని సమయంలో చెట్ల కింద, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరండాలో సేదతీరాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తక్షణమే స్పందించి 108 అంబులెన్స్ సిబ్బందికి వసతి ఏర్పాటు చేయాలని కోరారు. రేణికుంట్ల ప్రేమ్ కుమార్, చెన్నబోయిన కొమురయ్య, విజయ్ పాల్గొన్నారు.

వేకువజామునే రైతుల క్యూ



దామెర : యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో రైతులు వేకువజామునే పీఏసీఎస్ వద్ద క్యూ కట్టారు. మండలంలోని ఊరుగొండ(పెద్దాపూర్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం యూరియా పంపిణీకి ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజామున 5 గంటలకే పీఏసీఎస్ వద్దకు భారీగా చేరుకున్నారు. మహిళలు, పురుషులు పట్టా పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులతో క్యూ కట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కొంక అశోక్ బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా ఫీడర్‌లోని లష్కర్ బజార్, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయినగర్ ఫీడర్‌లోని లష్కర్ బజార్, లష్కర్ బజార్ మెయిన్ రోడ్డులో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, సుబేదారి చోటీ మసీదు, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌలి, నిజాంపుర, మండిబజార్, ఎల్‌బీ.నగర్, గోవిందరాజుల గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: హసన్‌పర్తి ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శిరీష్ తెలిపారు.

7న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం



వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందాద్రి కొండపై గోవిందరాజస్వామి గుట్టపై ఈనెల 7న గోవిందాద్రి గోశాల సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాస్ స్వామి తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకుడు గోవిందాద్రి గోశాల వ్యవస్థాపకులు లక్ష్మణ స్వామి, తాడూరి గోపిస్వామి, ప్రసాద్‌స్వామి, వరయోగుల నరేష్ స్వామి, మురళీకృష్ణ స్వామి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ కిన్నెర వెంకటేశ్వర్లు రచించిన ట్రిన్ డ్రైవర్స్ అనే పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోషియాలజీ విభాగం అధిపతి డాక్టర్ స్వర్ణలత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అయిలయ్య, డాక్టర్ కిన్నెర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా తేళ్ల కిశోర్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయనకు బుధవారం నియామక పత్రం అందించారు.

రైతులకు యూరియా కష్టాలు




హసన్‌పర్తి: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. మంగళవారం రాత్రి సొసైటీలకు యూరియా రావడంతో తెల్లవారుజాము నుంచే రైతులు బారులు దీరారు. పరిస్థితి అదుపు తప్పే పరిస్థితి ఉందనే సమాచారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో నిలబడిన రైతులు చివరికి యూరియా అందక నిరాశతో వెనుదిరిగారు.

రైతు సంఘంలో సభ్యత్వాలు

కాజీపేట: కాజీపేట మండలం దర్గా కాజీపేట సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు కానున్న రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైనట్లు ఏఈఓ భరత్ తెలిపారు. నూతన సభ్యత్వం తీసుకోవాలని ఆసక్తి ఉన్న రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను దర్గా సొసైటీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సభ్యత్వ రుసుం రూ.2 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94401 38409 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలి



కాజీపేట రూరల్: దర్గా కాజీపేటలోని గాంధీనగర్‌లోని శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సీపీఎం కాజీపేట మండల నాయకుడు తొట్టె మల్లేషం డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల అధ్యయనంలో భాగంగా శ్మశాన వాటికను బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, బద్రి, మేకమల్ల బాబు పాల్గొన్నారు.